సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం । 4 । నవంబర్ । 2024



వంగ తోట.. లాభాల పంట

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో టమాట, పూలతోటల సాగుతో నష్టపోయిన రైతులను.. ప్రస్తుతం వంగ సాగు ఆదుకుంటోంది. -8లో



తల్లీబిడ్డలు అదృశ్యం

మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారి పల్లె మాయబజార్‌కు చెందిన తల్లీబిడ్డలు అదృశ్యమయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.300	రూ.360
రెండోరకం	రూ.200	రూ.260

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 281 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	5400	540
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 130.240 కిలోలు

న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి పత్రికలకు అందజేసిన ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

6 నుంచి బాల్ బాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలు

మదనపల్లె సిటీ: బాల్‌బాడ్మింటన్ అండర్-14 బాల,బాలికల రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 6,7 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. ములకలచెరువులో జరిగే పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పోటీలకు హాజరు కానున్నట్లు తెలిపారు.

నేడు ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాలలో కామర్స్, కాంపిట్యూషనల్ డేటా సైన్సెస్ సబ్జెక్టులలో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. కామర్స్ సబ్జెక్టు గెస్ట్ ఫ్యాకల్టీకి ఎంకాం అర్హతతో పాటు పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత ఉండాలని పేర్కొన్నారు. కాంపిట్యూషనల్ డేటా సైన్సెస్ సబ్జెక్టునకు ఎమ్మెస్సీ (మ్యాథ్స్), ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎమ్మెస్సీ డేటసైన్స్ , ఎంసీఏలలో ఏదో ఒక అర్హతతో పాటు పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హతలు ఉండాలని వివరించారు. అర్హత గల అభ్యర్థులు ఒరిజనల్ అర్హత పత్రాలతో నవంబర్ 4వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయ క్యాంపస్ లోని ప్రిన్సిపల్ ఛాంబర్‌లో హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక జార్జ్‌కారొనేషన్ క్లబ్‌లో సోమవారం 68వ ఎస్జీఎఫ్ఐ బాలబాలికల అండర్ -19 పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ జిలాని బాషా ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 130 మంది క్రీడాకారులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. టీం ఛాంపియన్‌షిప్, ఇండివిడువల్ ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తామని ఈ పోటీల్లో ప్రతిభ కనపరచిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామని వివరించారు. మధ్యప్రదేశ్‌లో ఈ నెల 17 నుంచి 21 వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు.

అంతర్ కళాశాలల పోటీలు ప్రారంభం



షూటింగ్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వ విద్యాలయంలో ఆదివారం 2వ దశ అంతర్ కళాశాలల పోటీలను వైవీయూ వీసీ కృష్ణారెడ్డి ప్రారంభించారు. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, షూటింగ్ , బెస్ట్ ఫిజిక్ పోటీలను నిర్వహించారు. సంబంధిత పోటీలను విశ్వవిద్యాలయం వ్యాయామ విద్య, క్రీడాశాస్త్రల విభాగంలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని 10 కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కుల సచివులు పి. పద్మ, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ చైర్మన్ సుదర్శన్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్ ట్రేడ్ యూనియన్ల జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సర్వీసులు, లెన్త్ ఆఫ్ లైన్స్ , డీటీఆర్ లు 4 రెట్లు పైగా పెరిగాయని.. అందకనుగుణంగా 20 ఏళ్లుగా కార్మిక, ఉద్యోగుల పోస్టులు మాత్రం పెంచడం లేదన్నారు. విద్యుత్ ఉద్యోగులకు రెండు డి.ఏ లు పెండింగ్ లో ఉన్నాయన్నారు. విద్యుత్ సంస్థల్లో ఖాళీ పోస్టులను ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులతో భర్తీ చేయాలని కోరారు. విద్యుత్ యాజమాన్యాలు కాంట్రాక్టు కార్మికుల విషయంలో సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాయని మండిపడ్డారు . ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, స్ట్రగుల్ కమిటీ నాయకులు యస్ .జి .శేఖర్ , సురేంద్ర , నాగ మల్లయ్య , భాషలు, శివప్రసాద్‌రెడ్డి, నాగరాజు,రఘు పాల్గొన్నారు.

రైతులకు మేలు చేయండి

- నాటి ప్రభుత్వంపై విమర్శలు వద్దు.. మీరేమి చేస్తున్నారో చెప్పండి
- డీఆర్‌సీ సమావేశంలో ఎంపీ మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి
- నామమాత్రపు సమీక్షలు, ప్రతిపక్షంపై ఆరోపణలతో ముగిసిన డీఆర్‌సీ
- సమావేశానికి హాజరైన జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



డీఆర్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి. చిత్రంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, షాజహాన్‌బాషు, కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ, జేసీ తదితరులు

రాయచోటి: వ్యవసాయమే ఆధారంగా జీవనం సాగిస్తున్న జిల్లా రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిలు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన అన్నమయ్య జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశానికి (డీఆర్‌సీ) జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సమీక్షలో జిల్లా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మేడా రఘునాథరెడ్డి, ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి గళం విప్పారు. 'నానో ఫర్టిలైజర్స్‌ను ఉపయోగించే విధంగా రైతులకు తగిన శిక్షణ ఇవ్వాలి. రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలు ఉద్యానవన పంటలకు ప్రసిద్ధిగాంచాయి.. ఉద్యాన పంటలను సాగు చేసిన రైతులకు సౌకర్యవంతంగా వ్యవసాయ చెరువులు ఏర్పాటు చేయాలి. కరువుతో అతలాకుతలమైన జిల్లా రైతాంగాన్ని పూర్తి స్థాయిలో ఆదుకోవాలి. కరువు ప్రాంతాల ప్రకటనతో సరిపుచ్చకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా ఆర్థిక సహాయక చర్యలు తీసుకోవాలి. రాజంపేట ప్రాంతంలో ఇసుక రీచ్‌లు అధికంగా ఉన్నాయి.. తద్వారా ట్రాక్టర్లు, లారీలతో ఇసుక రవాణా అధికంగా ఉంది. దీంతో రోడ్లు భారీగా దెబ్బతిన్నాయి.. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ రోడ్ల మరమ్మతులకు సత్వరం చర్యలు తీసుకోవాలి.' అని మేడా రఘునాథరెడ్డి, ఆకేపాటి అమరనాథరెడ్డిలు సమావేశంలో డిమాండ్ చేశారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి: అన్నమయ్య జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. జిల్లా అభివృద్ధిపై శాఖల వారీగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో కలిసి ఆయన సమీక్షించారు. మంత్రి, జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, అధికారులు సూచించిన పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానన్నారు. భూ సమస్యలను పరిష్కరించడానికి నూతన కమిటీని ఏర్పాటు చేసి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియ సమస్యను సీఎంకు వివరిస్తానన్నారు.

జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై...
అన్నమయ్య జిల్లాకు సంబంధించిన అభివృద్ధి, సంక్షేమంతో పాటు వివిధ శాఖల స్థితిగతులపై జిల్లా కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదర్శ రాజేంద్రన్‌లు పవర్ పాయింట్ ద్వారా వివరించారు. జిల్లాలో ఫ్రీ హోల్డ్ రీవెరిఫికేషన్‌లో ఆరు నియోజకవర్గాల పరిధిలో 65 వేల ఎకరాలకు పైగా ఆమోదించామన్నారు. 69, 886 ఎకరాలు తిరస్కరించినట్లు కలెక్టర్ వివరించారు.

విమర్శలతో సరి..
సమీక్షా సమావేశంలో మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధిని పక్కన పెట్టి ప్రతిపక్ష పార్టీపై విమర్శలు చేయడంతోనే సమావేశాన్ని ముగించారు. జిల్లాలో కరువు విలయతాండవం చేస్తున్నా ప్రజలను ఏ విధంగా ఆదుకోవాలన్న చర్చను పక్కనపెట్టారు. జిల్లాకు కృష్ణా జలాల తరలింపు, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసే విషయంలో ఎలాంటి చర్చ జరగలేదు. జిల్లాలో ఆగిపోయిన అభి వృద్ధి పనుల సమీక్ష విషయం కూడా చర్చకు దూరమైంది. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన విద్యా కేంద్రాల విషయం మరుగున పడింది. కేవలం సీఎం చంద్రబాబు సూచనలకు అనుగుణంగానే ఊకదంపుడు ఉపన్యాసాలు, ప్రతిపక్ష పార్టీపై విమర్శలతో సమావేశాన్ని పూర్తి చేశారన్న విమర్శలు ఉన్నాయి.

విమర్శలు మానండి.. హామీలు అమలు చేయండి



నాటి ప్రభుత్వంపై విమర్శలు మాని.. అధికారంలో ఉన్న మీరు నేడు ఏమి చేస్తున్నారో చెప్పాలని టీడీపీ ఎమ్మెల్యేలకు రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి చురకలు అంటించారు. సమావేశం ప్రారంభం నుంచి గత వైఎస్ఆర్‌సీపీ పాలనలో జరిగిన కార్యక్రమాలపై అధికార పార్టీ ఎమ్మెల్యేలు విమర్శలు చేస్తుండటంపై ఆకేపాటి తీవ్రంగా ఆక్షేపించారు. 'ప్రజలు మిమ్మలను నమ్మి మీకు ఓట్లు వేశారు. ఎన్నికల సందర్భంగా మీరు సూపర్‌సిక్స్ అంటూ గొప్పగా హామీలు ఇచ్చారు.. అధికారంలోకి రాగానే అమలు చేస్తామని చెప్పారు. ఇప్పుడు ఆ హామీలు ఏమయ్యాయి. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రతిపక్ష పార్టీపై విమర్శలు చేస్తున్నారు.. ఇది సరైన పద్ధతి కాదు.. ముందు సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయండి.. వాటిపై దృష్టి పెట్టండి .. ప్రజలకు మంచి చేయండి.. పంటలు దెబ్బతిని రైతులు నష్టాలలో ఉన్నారు.. వారిని ఆదుకోండి' అంటూ అధికార పక్ష నాయకులపై ఆకేపాటి మండిపడ్డారు.

అవి చేశాం.. ఇవి చేశాం..

- ఇన్‌చార్జి మంత్రి నోట అబద్ధపు మాటలు

రాయచోటి: డీఆర్సీ సమావేశం సాక్షిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నోటివెంట కూటమి ప్రభుత్వం అబద్ధాల మాటలు పలికించింది. కలియుగ దైవమైన శ్రీ వెంకటేశ్వరస్వామిపై 32 వేల కీర్తనలు రచించిన అన్నమాచార్యులు జన్మించిన జిల్లాకు ఇన్‌చార్జ్ మంత్రిగా రావడం ఆనందంగా ఉంది.. అంటూనే అన్నమయ్య సాక్షిగా అసత్యపు మాటలు మాట్లాడారు. మొదటి సమావేశంలోనే ఏదో సాధించినట్లు మంత్రి చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం హామీలిచ్చిన పథకాల అమలులో విఫలమైనా.. దానిని పక్కనపెట్టి అంతా బాగుందని అసత్యాలు వల్లెవేశారు. మంత్రివర్గ కార్యాలయ సిబ్బంది సహాయంతో, అన్నమయ్య జిల్లాలోని ఎన్డీఏ కూటమి మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, పార్టీ కార్యకర్తలతో ఎప్పటికప్పుడు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షిస్తూనే ఉన్నానని గొప్పలు చెప్పారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయానికి సంబంధించిన భూ కుంభకోణం జరిగిపోయిందని, దానిపై తమ ప్రభుత్వం ఏదో సాధించిందని చెప్పడం విడ్డూరంగా అనిపించింది. జాతీయ రహదారుల పనులు, ఉచిత ఇసుక పాలసీ జిల్లాలో విజయవంతంగా అమలవుతోందని తెలుస్తోందని, ఇసుక విధానంలో విజయవంతంగా ముందుకు పోతున్నామని చెప్పడం ఆశ్చర్యం కలిగించింది. ఊసేలేని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలలో పురోగతిని సాధించామని గొప్పలు చెప్పారు. కార్యకర్తల సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే ఉన్నామని చిలకపలుకులు పలకడం అందరినీ ఆశ్చర్య చకితులను చేసింది.

కరువు ప్రాంతాన్ని ఆదుకోవాలి: మంత్రి మండిపల్లి

రాయచోటి: తీవ్ర దుర్భిక్ష ప్రాంతంగా ఉన్న రాయచోటి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దృష్టికి తెచ్చారు. ఆదివారం జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. కరువుతో ఉన్న మండలాలలో రైతులు, కూలీలు, ప్రజలను ఆదుకునేలా ఇన్‌చార్జ్ మంత్రి సహకరించాలని కోరారు. పశువులకు తగినంత గ్రాసాన్ని అందించేలా చూడాలన్నారు. వర్షాభావంతో రాయచోటి నియోజకవర్గంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని తెలిపారు. ఆరు మండలాల్లో నీటి సౌకర్యం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. జిల్లాలో టమోటా, మామిడి, ఇతర పండ్ల తోటలు అధికంగా సాగులో ఉన్నాయన్నారు. వీటి అభివృద్ధి కోసం ప్రాసెసింగ్ కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు ఏర్పాటు చేయించాలని సూచించారు. జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా చేయడానికి మీ సూచనలు, సలహాలు సహకారం కోరుతున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

ప్రభుత్వ బడిని బతికించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యం



సమావేశానికి హాజరైన జిల్లా ప్రతినిధులు

మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

మదనపల్లె సిటీ: పాలకుల విధానాల వల్ల ప్రభుత్వ బడి నిర్వీర్యం అవుతోందని, దీన్ని కాపాడుకోవడానికి యూటీఎఫ్ నిరంతరం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. మదనపల్లెలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ అనుకూల విధానాలు కారణంగా పేద ప్రజలు చదువులకు దూరం అవుతున్నారన్నారు. ప్రభుత్వ విద్యారంగం బాగుపడాలంటే యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో సంబంధాలు కలిగి ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణకు నడుంబిగించాలని కోరారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ స్తంభాలుగా ఏర్పడిన యూటీఎఫ్ లక్ష్యం కోసం పనిచేద్దామన్నారు. ఒక ఉపాధ్యాయ సంఘం లక్ష సభ్యత్వంతో రాష్ట్రంలో బలమైన సంఘంగా ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి చేసుకుందని.. దీనిని కొత్త ఒరవడిగా కొనసాగించాలన్నారు. రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ 13వ పీఆర్సీ ఊసే ఎత్తడం లేదని, నెలవారీ ప్రమోషన్ పక్కన పెట్టారని వీటినన్నింటినీ సాధించి తీరుతామన్నారు. పూర్వ రాష్ట్ర కార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్‌నాయుడు, అధ్యక్షులు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి జాబీర్, సహాధ్యక్షులు హేమలత, శివారెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా నాయకులు పురం రమణ, సురేంద్రరెడ్డి, రమణమూర్తి, ఆది నారాయణ, భాస్కర్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక అంశంలో ప్రభుత్వం విఫలం

- 11న కలెక్టరేట్‌ల వద్ద ధర్నా జయప్రదం చేయండి
- ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు



మాట్లాడుతున్న ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు

రాయచోటి అర్బన్: ఉచితంగా ఇసుకను అందచేస్తామన్న హామీ అమలులో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందడం దారుణమని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇసుక ఉచితం అంటూ చెబుతున్న కూటమి ప్రభుత్వం ఆచరణలో చూపడం లేదన్నారు. మొత్తం రాష్ట్రంలో 110 ఇసుక ర్యాంపులు ఉంటే 76 ర్యాంపులు మాత్రమే ప్రారంభించి మిగిలినవి చేయలేదన్నారు. ఆన్‌లైన్‌లో ఇసుక దరఖాస్తు చేసుకుంటే 24 గంటల్లో ఇసుక అంటూ చెబుతున్నారే కానీ ఇసుక బుకింగ్‌కు 48 గంటలు గడిచినా ఆన్‌లైన్ ఓపెన్ కావడం లేదన్నారు. ఇసుక ర్యాంపులను ప్రైవేటు ఏజన్సీలకు కేటాయించడం అంటే అక్రమ వ్యాపారానికి అవకాశం ఇవ్వటమే, ప్రజలకు నష్టం చేయటమే అన్నారు. ప్రభుత్వమే స్వయంగా ఇసుక ర్యాంపులను నిర్వహించాలన్నారు. ఇసుక అక్రమ రవాణా కాకుండా చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. ఇసుకను ఉచితంగా అందేలా చూడడం ద్వారా భవన నిర్మాణ కార్మికులకు మేలు చేకూర్చాలంటూ కోరారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులను అన్నిరకాలుగా ఆదుకోవాలన్న డిమాండ్‌తో ఈనెల 11వ తేదీన అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద జరిగే ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

దేదీప్యమానం!





కార్తీకం.. శుభకరం -8లో

కార్తీక దీప వెలుగుల్లో శివాలయాలు శోభిల్లనున్నాయి. శివోహం నామస్మరణతో మార్మోగనున్నాయి. కార్తీకమాసం ప్రారంభం కావడంతో జిల్లాలోని శైవక్షేత్రాలు అందంగా ముస్తాబయ్యాయి. నేడు తొలి కార్తీక సోమవారం సందర్భంగా కార్తీక దీపాలు వెలిగించేందుకు ఆలయ అవరణలు సిద్ధమయ్యాయి. దాదాపు ప్రతి శివాలయంలోనూ వీలున్నంత మేరకు భక్తులు దీపాలు వెలిగించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పలుచోట్ల ఉన్న స్థలాలను మరింత విశాలం చేసి రద్దీ నియంత్రణకు బారికేడ్లు, నీడనిచ్చేందుకు చలువ పందిళ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. ఉదయం 4 గంటల నుంచి అన్ని శివాలయాల్లోనూ స్వామికి విశేష అభిషేకాలు చేస్తారు. 5.30 గంటల నుంచి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. - కడప కల్చరల్

ఆర్టీసీ బస్సు- సిలిండర్ల లారీ ఢీ



చెల్లాచెదరుగా గ్యాస్ సిలిండర్లు



పక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



గాయపడిన బస్సు డ్రైవర్

- బస్సు డ్రైవర్ సహా 15 మందికి గాయాలు
- కర్ణాటకలో చింతామణి వద్ద ఘటన

చింతామణి: కడప నుంచి బెంగళూరుకు వస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సు- వంట గ్యాస్ సిలిండర్ల లారీ ఢీకొన్న ప్రమాదంలో 15 మంది గాయపడ్డారు. ఈ ఘటన కర్ణాటకలో చిక్కబళ్లాపుర జిల్లా చింతామణి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని సంతకల్లహళ్లి క్రాస్ దగ్గర జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఆదివారం మధ్యాహ్నం కడప నుంచి మదనపల్లి మీదుగా బెంగళూరుకు వెళుతున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు, సంతకల్లహళ్లి క్రాస్ దగ్గర ఎదురుగా వస్తున్న సిలిండర్ల లారీ అదుపుతప్పి ఢీకొన్నాయి. బస్సు రోడ్డు పక్కన ఉన్న తోటలోకి దూసుకెళ్లింది. లారీ ఓ వైపు బాగా ధ్వంసం కాగా, సిలిండర్లు ఎగిరి రోడ్డుపై చిందరవందరగా పడిపోయాయి. అదృష్టవశాత్తు పేలకపోవడంతో మరో ప్రమాదం తప్పినట్లయిందని ఆ ప్రాంతవాసులు ఊపిరిపీల్చుకొన్నారు. ప్రమాదంలో బస్సు డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంకటేష్, నిత్య పూజ, అరుణమ్మ సహా బస్సులో 15 మంది ప్రయాణికులు గాయపడ్డారు. బాధితులు కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన వారు. క్షతగాత్రులు చింతామణి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఘటనాస్థలాన్ని మంత్రి సుధాకర్, డీఎస్పీ మురళీధర్, సీఐ శివరాజ్ పోలీసులు పరిశీలించారు.

క్లుప్తంగా

తల్లీబిడ్డలు అదృశ్యం


ధనుశ్రీ, పిల్లలు (ఫైల్)

మదనపల్లె : తల్లీబిడ్డలు అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. తంబళ్లపల్లె మండలం ఎద్దులవారిపల్లె పంచాయతీ జన్నెవారిపల్లెకు చెందిన మల్లికార్జున కుమార్తె ధనుశ్రీ (32)కి 11 ఏళ్ల క్రితం పీలేరు ఇందిరమ్మ కాలనీకి చెందిన దేవర భాస్కర్‌తో వివాహమైంది. వీరికి కుమారులు పార్థివ్ (10), ధనుష్ (8) ఉన్నారు. వీరు కొన్నేళ్లుగా మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె మాయబజార్‌లో ఉంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ధనుశ్రీ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఎక్కడికో వెళ్లి పోయింది. తిరిగి ఇంటికి రాలేదు. ఈ విషయాన్ని ఆమె భర్త భాస్కర్ పుట్టింటి వారికి సమాచారం అందించారు. అందరూ కలిసి పలు చోట్ల ఆమె కోసం గాలించారు. అయినా ఫలితం లేకపోవడంతో శనివారం రాత్రి టూ టౌన్ పోలీసులకు ధనుశ్రీ తండ్రి మల్లికార్జున ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడిపై దాడి

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలో యువకుడిపై దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల వివరాల మేరకు.. ఒంటిమిట్టకు చెందిన ముగ్గురు యువకులు కళాశాలలో గొడవల కారణంగా ఒకరిపై ఒకరు మనస్పర్థలు పెంచుకున్నారు. గతంలో వినాయక చవితి నాడు ఏర్పడిన ఘర్షణను దృష్టిలో ఉంచుకొని నితిన్ అనే యువకునిపై ఆదివారం స్థానిక జెండామాను వీధిలో మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ దాడిలో నితిన్‌కు తీవ్ర రక్త గాయాలయ్యాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా దాడికి పాల్పడిన ప్రేమ్, రాజేష్ మరో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. యువకులు ఘర్షణలు వంటి సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

కార్తీకం.. శుభకరం

- ప్రారంభమైన కార్తీక మాసం
- సోమవారాల్లో విశేష పూజలు
- పౌర్ణమినాడు కల్యాణాలు

కడప కల్చరల్ : కార్తీకమాసం ప్రారంభమైంది. ఈ సందర్భంగా గురువారం శైవ, వైష్ణవ దేవాలయాన్నీ కొత్త కళను సంతరించుకున్నాయి. సాధారణంగా అందరూ ఈ పండుగను శైవులకు సంబంధించినదని భావిస్తారు. కానీ ఈ పండుగ శివకేశవులిద్దరికీ ముఖ్యమైనదేనని పెద్దలు చెబుతున్నారు. అటు శివాలయాల్లోనూ, ఇటు వైష్ణవ ఆలయాల్లోనూ ఈ మాసమంతా విశేష పూజలు నిర్వహిస్తారు. ముఖ్యంగా ఇతర మాసాలతో పోలిస్తే శైవులకు కార్తీకమాసం అత్యంత పవిత్రమైంది. ఈ సందర్భంగా ఉదయాన్నే శివుడికి విశేష అభిషేకాలు చేసి పూజలు నిర్వహిస్తే పుణ్యం లభిస్తుందని విశ్వాసం. ప్రతి సోమవారం తెల్లవారుజాము నుంచి శివాలయాల్లో కార్తీక దీపాలు వెలిగిస్తారు. ప్రతిరోజు అర్చకులు ధ్వజస్తంభంపై ఆకాశదీపం వెలిగిస్తారు. పౌర్ణమి నాడు జ్వాలాతోరణాలు వెలిగించడం పుణ్యదాయకమని విశ్వసిస్తారు. దీపాలను చెరువులు, కాల్వల్లో వదులుతారు. ఈ మాసమంతా సోమవారాలతో పాటు ఇతర రోజుల్లో కూడా శివాలయాలు భక్తులతో సందడిగా మారుతాయి. ఈ సందర్భంగా ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లాలో కార్తీక పూజలు నిర్వహించే ప్రముఖ శివాలయాల గురించి క్లుప్తంగా..


నాగనాథేశ్వరుడు

ఖాజీపేట మండలంలో ప్రకృతి రమణీయత మధ్య శ్రీ నాగనాథేశ్వరుని కోన ఆహ్లాదాన్ని పంచుతుంది. పుల్లూరు సమీపంలోని నాగేశ్వరుని కొండపై స్వామి స్వయంభువుగా వెలిశారు. చారిత్రాత్మకమైన ఈ ఆలయంలో కార్తీక మాసమంతా జనం కిటకిటలాడుతారు. ఇక్కడి గుహల్లో బౌద్ధ చిహ్నాలుగల శిథిలాలు బయల్పడ్డాయి. భక్తులు కొండపైగల స్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలివస్తారు.

భైరేశుని కోన

వేముల సమీపంలోని నల్లచెరువుపల్లెకు నాలుగు కిలోమీటర్ల దూరంలోగల మోపూరు కొండపై శ్రీ భైరేశ్వరుని ఆలయం ఉంది. స్వయంభువుగా భావించే ఇక్కడి శివలింగం 18 అడుగుల ఎత్తు, ఆరు అడుగుల చుట్టు కొలతతో భారీగా కనిపిస్తుంది. కార్తీక మాసమంతా ఈ క్షేత్రంలో భక్తుల సందడి కనిపిస్తుంది. వీటితోపాటు జిల్లాలో ఇంకా బద్వేలు సమీపంలోని లంకమల అరణ్యంలో శ్రీ రామలింగేశ్వరస్వామి క్షేత్రం, అనిమెల సంగమేశ్వరస్వామి క్షేత్రం, అల్లాడుపల్లె వీరభద్రస్వామి క్షేత్రం, బ్రహ్మంగారిమఠం తదితర ప్రాంతాల్లో కూడా శివభక్తులు ఈ మాసమంతా విశేష పూజలు చేసి దీపాలు వెలిగిస్తారు.

• పుష్పగిరి


పుష్పగిరి శివకేశవుల ఆలయాల ప్రాంగణం

జిల్లాలోని ప్రముఖ పర్యాటక క్షేత్రాలలో పుష్పగిరి ప్రథమ శ్రేణిలో ఉంది. శివకేశవులకు అబేధంగా నిలుస్తున్న ఈ క్షేత్రంలో కార్తీకమాసం అంతా భారీగా పూజలు జరుగుతాయి. ఇటీవల గిరి ప్రదక్షిణ నిర్వహిస్తుండటంతో పుష్పగిరికి విస్తృతమైన ప్రచారం లభించడంతో భక్తులు కూడా పెద్ద సంఖ్యలో వస్తారని అంచనా వేస్తున్నారు. పెన్నానది ఒడ్డున గల ఈ క్షేత్రంలో కార్తీక మాసమంతా భక్తుల సందడి కనిపిస్తుంది. కడప నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు తెల్లవారుజామునే.. అక్కడికి చేరి పెన్నానదిలో స్నానం చేసి పూజలు నిర్వహిస్తారు.

• త్రేతేశ్వరస్వామి ఆలయం


అత్తిరాల త్రేతేశ్వరస్వామి ఆలయం

రాజంపేట నుంచి నెల్లూరు మార్గంలో ఉన్న అత్తిరాల క్షేత్రంలో త్రేతేశ్వరస్వామి ఆలయం ఉంది. గుట్టపై గల ఈ ఆలయంలో శ్రీ త్రేతేశ్వర స్వామి పూజలందుకుంటున్నారు. ఈ ప్రాంతంలో కామాక్షిమాత ఆలయంతోపాటు గదాధర స్వామి ఆలయం కూడా ఉంది. కార్తీక మాసమంతా ఈ క్షేత్రం భక్తులతో, వారు పెట్టే కార్తీక దీపాలతో కళకళలాడుతుంది. ఇక్కడి మడుగులో భక్తులు తెల్లవారుజామున స్నానాలు చేసి స్వామిని దర్శించుకుంటారు.

• గుండ్లూరు శివాలయం


గుండ్లూరు శివాలయం

నందలూరు వద్దగల గుండ్లూరు శివాలయానికి ఓ విశిష్టత ఉంది. కార్తీక మాసంలో ఏదో ఒక సోమవారం ఆలయంలో అడుగు మేరకు నీరు ఊరుతుంది. తిరిగి సాయంత్రానికి నీరు ఆరిపోతుంది. ఆలయం వెలుపల భారీ వృక్షాలు, ఆలయం లోపల ఈ క్షేత్రం అత్యంత పురాతనమైనదని తెలుపుతున్న దేవతా మూర్తుల శిథిల శిల్పాలు ఉన్నాయి. విశాలమైన ఈ ఆలయ ప్రాంగణంలో కార్తీక మాసంలో సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు పూజలు నిర్వహిస్తారు.

• శ్రీ వీరభద్రాలయం


శ్రీ వీరభద్రస్వామి

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన, అత్యంత పురాతనమైనదిగా భావిస్తున్న రాయచోటి శ్రీ వీరభద్రస్వామి ఆలయం జిల్లాలో ప్రముఖ దేవాలయాలలో ఒకటి. 10, 11 శతాబ్దాలలో నిర్మితమైనదిగా భావిస్తున్న ఈ ఆలయంలో వీరభద్రస్వామి ఆలయం పక్కనే శ్రీ భద్రకాళిమాత ఆలయం కూడా ఉంది. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి ఈ క్షేత్రానికి కార్తీకమాసమంతా శైవ భక్తులు పెద్ద ఎత్తున రావడం పరిపాటి.

• పాలతల మల్లేశ్వరుడు


పాలతల శ్రీ మల్లికార్జునుడు

జిల్లాలో అత్యంత ప్రాముఖ్యత, ఉత్సవ సమయంలో పెద్ద ఎత్తున భక్తులు వచ్చే ఆలయాలలో పాలతల మల్లేశ్వరస్వామి ఆలయం ఒకటి. పెండ్లిమర్రి మండలంలోని ఎత్తయిన కొండలపై విశాలమైన ఆవరణలో గల చిన్న గుట్టపై శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి కొలువై ఉన్నారు. సమీపంలో అక్కదేవతలు కూడా ఉన్నారు. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ప్రజలు కార్తీక మాసంలో ఈ క్షేత్రంలో విశేష పూజలు నిర్వహిస్తారు.



దీపం.. దైవ స్వరూపం

మదనపల్లె సిటీ : కార్తీమాసాన్ని భక్తులు అత్యంత భక్తిభావాలతో నిర్వహిస్తారు. ఈ మాసంలో దీపారాధన ప్రత్యేకం. ఈ నెల 2న ప్రారంభమైన కార్తీక మాసం డిసెంబర్ 12వ తేదీన ముగుస్తుంది. ఈ నెలలో దీపారాధన చేయడం ద్వారా భక్తులు పుణ్యాన్ని ఆశిస్తారు. దీపం దైవ స్వరూపమని వారు నమ్ముతున్నారు. జిల్లాలోని ఆలయాలు దీపకాంతులతో శోభిల్లనున్నాయి. దైవనామస్మరణతో జిల్లా పులకరించనుంది. మదనపల్లెలోని యోగభోగేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి ఆలయాలు, నిమ్మనపల్లె మండలం తవళంలోని నేలమల్లేశ్వరస్వామి, తంబళ్లపల్లెలోని శ్రీ మల్లికార్జున భ్రమరాంభిక, రాయచోటిలోని వీరభద్రస్వామి, ఉమామహేశ్వరి, గండిమడుగు విరూపాక్షమ్మ ఆలయాలను ముస్తాబు చేశారు. రాజంపేటలోని అత్తిరాల, రైల్వేకోడూరులోని భుజంగేశ్వరస్వామి, కామేశ్వరితీర్థేశ్వర, మల్లికార్జునస్వామి, కోడూరులోని సోమేశ్వరస్వామి, చిట్వేలిలోని సిద్దేశ్వర, కలకడ చంద్రమౌళి, ములకలచెరువులోని అనంతపురం శివాలయం, రామాపురంలోని హసనాపురం శివాలయం, సిద్దవటం మండలంలోని నిత్య పూజకోన, ఒంటిమిట్టలోని ముకుంద మల్లేశ్వరస్వామి ఆలయంతోపాటు పలు శివాలయాల్లో భక్తుల సందడి ఉంటుంది.


మదనపల్లెలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం

భక్తులకు అన్ని ఏర్పాట్లు



కార్తీకమాసంలో శివాలయాల్లో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్లు ఏర్పాటు చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆయా ఆలయ ఈఓలకు ఆదేశాలు జారీ చేశాం.

-విశ్వనాథ్, జిల్లా దేవదాయశాఖ అధికారి

స్టార్టప్ రంగంలో కొత్త అధ్యాయం 'భాస్కర్ ప్లాట్‌ఫాం'

- పులివెందుల వాసి భాస్కర రామ్ కృషి



పులివెందుల టౌన్ : భారత దేశంలో స్టార్టప్‌లకు నూతన వేదికగా రూపుదిద్దుకుంటున్న భాస్కర్ వేదికను స్టార్ట్ అఫ్ ఇండియా వారు (భారత స్టార్టప్ పరిజ్ఞాన ప్రాప్యత రిజిస్ట్రీ) ప్రారంభించారు. ఈ భాస్కర్ ప్లాట్‌ఫాం వేదిక రూపకల్పన, ప్రణాళికకు వైఎస్‌ఆర్ జిల్లా పులివెందులకు చెందిన అల్లం భాస్కర రామ్ స్థాపించిన 'కెర్డోస్ ఇన్‌ఫ్రాసాఫ్ట్' అనే సంస్థ కృషి చేసింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ వారికి కంపెనీ కేరడోస్ సంస్థ జనరల్ మేనేజర్ అల్లం భాస్కర రామ్, డైరెక్టర్ రాజేష్‌లు తమ ఆలోచనలు, ప్రణాళికలను పంపించడం జరిగింది. ఇందుకు స్పందించిన గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారు స్టార్టప్ ఇండియా వారు వెంటనే 'భాస్కర్ ప్లాట్‌ఫాం' వేదికను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వేదికకు కేరడోస్ సంస్థ జనరల్ మేనేజర్ భాస్కర రామ్ పేరులోని భాస్కర్‌ను తీసుకోవడం జరిగింది. ఈ వేదిక ద్వారా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, మార్గదర్శకులు, విధాన నిర్ణేతలను ఒకే వేదికపైకి తీసుకొస్తూ స్టార్టప్‌లకు మార్కెట్ల పెద్ద అవకాశాలు, నూతన మార్గదర్శకాలు అందించే విధంగా డిజైన్ చేశారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ వారు ఒక ప్రశంసా పత్రాన్ని కూడా కెరడోస్ సంస్థ ప్రతినిధులకు పంపించారు.

సాఫ్ట్‌వేర్‌ల అభివృద్ధికి కృషి

కెర్డోస్ ఇన్‌ఫ్రాసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సాంకేతికత, ఆవిష్కరణల్లో ప్రత్యేకంగా పని చేస్తున్న సంస్థగా, ప్రధానంగా ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్‌ల అభివృద్ధి వాటికి మద్దతు అందించడంలో కృషి చేస్తూ ఉంది. బ్లాక్‌చైన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, ఫుల్ స్టాక్ వెబ్ డెవలప్‌మెంట్ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చేయడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. అంతే కాకుండా, లినక్స్ ఫౌండేషన్, హైపర్‌లెడ్జర్ ఫౌండేషన్, ఓడబ్ల్యూఏఎస్పీ, క్లౌడ్‌ఫ్లేర్, ఐపీఎఫ్ఎస్, ఎథీరియం, డిబియన్ వంటి అంతర్జాతీయ ఓపెన్ సోర్స్ సంస్థలతో భాగస్వాములు కలిగి, ఈ సంస్థ వాటి అభివృద్ధికి కూడా తోడ్పడుతోంది. భాస్కర్ వేదికలో 'కెర్డోస్ ఇన్‌ఫ్రాసాఫ్ట్' సంస్థ కీలక భాగస్వామిగా ఉండటంతో, దేశవ్యాప్తంగా స్టార్టప్‌లు వ్యాపార అవకాశాలను విస్తరించుకోవడం, పెట్టుబడిదారులను ఆకర్షించడం, సాంకేతిక జ్ఞానం పెంపొందించుకోవడం సులభతరమవుతుంది. గ్లోబల్ ఎంట్రప్రెన్యూర్‌షిప్‌లో భారతదేశ స్థాయిని పెంచుతూ, యువ పారిశ్రామికవేత్తలకు భాస్కర్ వేదిక ద్వారా కొత్త ఆవిష్కరణలకు, అభివృద్ధికి ప్రేరణను అందించేలా కెర్డోస్ ఇన్‌ఫ్రాసాఫ్ట్ సంస్థ కృషి చేస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు, ఆలోచనలు, సూచనలను సంబంధిత కేంద్ర ప్రభుత్వ శాఖకు పంపించగా వారు ఈ కెరడోస్ సంస్థ ప్రతిపాదించిన సూచనలకు అనుగుణంగా భాస్కర్ వేదికను ప్రకటించడం విశేషం. అంతేగాక కెరడోస్ సంస్థ ప్రతినిధులను వారిని ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన చెన్నకేశవ

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కొడూరు చెన్నకేశవ (29) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. వైఎస్‌ఆర్ జిల్లా గోపవరం మండలానికి చెందిన చెన్నకేశవ పీలేరు నుంచి ద్విచక్రవాహనంలో సొంత గ్రామానికి వెళ్తున్నాడు. మార్గం మధ్యలోని గుట్టపల్లె బావులకాడపల్లె క్రాస్ మిట్టసమీపంలోకి గాలివీడు నుంచి పీలేరుకు వెళుతున్న బొలేరో పికప్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో చెన్నకేశవ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య యమున, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా

వేంపల్లె : వేంపల్లె సమీపంలోని ఎస్ఎస్ఆర్ కల్యాణ మండపం వద్ద గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా పడింది. అయితే ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున అనంతపురం నుంచి లక్కిరెడ్డిపల్లెకి హెచ్‌పీ గ్యాస్ లారీ బయలు దేరింది. వేంపల్లెలోని పులివెందుల రోడ్డులో ఉన్న ఎస్ఎస్ఆర్ కల్యాణ మండపం వద్ద రాగానే ఒక్కసారిగా డివైడర్‌కు ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్‌కు చిన్న గాయాలు తప్ప ఎలాంటి ప్రమాదం జరగలేదు. గ్యాస్ లారీ బోల్తా పడడంతో విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గ్యాస్ లీకై ఉంటే చాలా ప్రమాదం జరిగి ఉండేదని ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

108 వాహనంలో సుఖ ప్రసవం


బిడ్డను బాలింత కుటుంబ సభ్యులకు చూపుతున్న 108 ఈఎంటీ

కలికిరి : 108 వాహనంలో సుఖప్రసవం జరిగిన ఘటన శనివారం రాత్రి కలికిరి పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పుంగనూరుకు చెందిన రెడ్డిప్రసాద్ భార్య రేణుక కలికిరి పట్టణంలోని బంధువుల ఇంటికి వచ్చింది. పురిటినొప్పులు రావడంతో శనివారం మధ్యాహ్నం రెండవ కాన్పు నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన మహిళల వైద్యనిపుణురాలు ఆశాలత, రేణుకకు రక్తంలో ప్లేట్‌లెట్స్ తక్కువ ఉన్నాయని, కాన్పులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని రాత్రి సమయంలో పీలేరు ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. దీంతో భయాందోళలనకు గురైన రేణుక బంధువులు 108 వాహనానికి సమాచారమిచ్చారు. 108 సిబ్బంది చంద్రబాబు, సీటీఎం రమణలు పీలేరుకు తరలిస్తుండగా మార్గంమధ్యలో పురుటినొప్పులు అధికమవ్వడంతో సుఖప్రసవం చేశారు. రేణుక పండంటి పాపకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీ, బిడ్డను పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డ ఆరోగ్యకరంగా ఉన్నట్లు 108 సిబ్బంది తెలిపారు. సుఖప్రవసంలో 108 సిబ్బంది చొరవను ఆమె కుటుంబ సభ్యులు కొనియాడారు.

కడపలోని దుకాణాల్లో దొంగల హల్‌చల్

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో చిల్లర దొంగలు హల్‌చల్ చేశారు. ఆదివారం తెల్లవారుజామున ఇద్దరు దొంగలు.. తాళాలను వేసిన కొన్ని షాపులలోకి చొరబడ్డారు. కేకే బేకరి, కొరియర్ ఆఫీసు, పల్లెపాల కేంద్రంలోనూ చోరీలు జరిగాయి. క్యూ అండ్ క్యూలో చోరీ యత్నం విఫలమైంది. కొన్ని షాపులలో షట్టర్‌ను తెరిచేందుకు విఫలయత్నం చేశారు. ఆయా షాపుల్లోకి ప్రవేశించిన దొంగలు టీషర్ట్‌లు వేసుకోవడం, దేవుని హుండీల వద్ద డబ్బులను తీసుకోవడం లాంటివి చేశారు. ఇప్పటి వరకు బాధితులు ఎవరూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేయలేదని, సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా పోలీసులు ఓ దొంగను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

వంగ తోట.. లాభాల పంట

- రెండు వారాలుగా పుంజుకొన్న ధరలు
- కర్ణాటక, తమిళనాడులో డిమాండ్
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు


చెరువుమొరవపల్లెలో సాగు చేసిన వంగ తోట


మంచి దిగుబడి వచ్చిన వంకాయలు

గుర్రంకొండ : జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో టమాట, పూలతోటల సాగుతో నష్టపోయిన రైతులను.. ప్రస్తుతం వంగ సాగు ఆదుకుంటోంది. రైతుల ఇంట సిరులు కురిపిస్తోంది. జిల్లాలో ఈ సీజన్‌లో 2650 హెక్టార్లలో వంగ తోటల సాగు చేపట్టారు. ఎకరానికి దుక్కుల నుంచి కాయలు కోతకు వచ్చే వరకు పెట్టుబడి రూ.లక్ష నుంచి 1.25 లక్షల వరకు వస్తుంది. మొక్కలు నాటిన 90 రోజులకు కాయలు కాయడం మొదలవుతుంది. సుమారు మూడు నెలల పాటు కాయల కోత ఉంటుంది.

ఎకరానికి రూ.4.80 లక్షల వరకు ఆదాయం

ఇటీవల కురిసిన వర్షాలకు టమాట, పూలతోటలు దెబ్బతిన్నాయి. దీంతో టమాట ధరలకు మార్కెట్‌లో నిలకడ ఉండటం లేదు. టమాట, పూలతో పోల్చితే వంగకు మంచి ధరలు పలుకుతుండటం విశేషం. ప్రస్తుతం వంగ పంట ఎకరానికి 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. మార్కెట్లో మొదటి రకం కిలో రూ.40, రెండో రకం కిలో రూ.32, మూడో రకం కిలో రూ.25 వరకు ధరలు పలుకుతున్నాయి. ఈ లెక్కన ఎకరానికి రూ.4 లక్షల నుంచి రూ.4.80 లక్షల వరకు ఆదాయం వస్తోంది. 15 రోజులుగా ఇవే ధరలు నిలకడగా ఉండడంతో.. రైతులు ఇప్పుడిప్పుడే లాభాల బాట పడుతున్నారు.

నాలుగు నెలల తరువాత..

దాదాపు నాలుగు నెలల తరువాత మార్కెట్‌లో వంగ ధరలు పుంజుకొన్నాయి. అంతకు ముందు ధరలు పతనమవడంతో పలువురు రైతులు తోటలు దున్నేశారు. ప్రస్తుతం ఓవైపు దిగుబడి లేకపోవడం.. మరోవైపు వర్షాలకు పంటలు దెబ్బతినడంతో వంగ ధరలు పెరిగాయి. తమిళనాడులో పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఎక్కువగా మన జిల్లా వంగ ఎగుమతి చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో వంగ తోటలు అంతంత మాత్రంగానే ఉండటంతో.. మన జిల్లా నుంచి ఎగుమతి చేస్తున్నారు. ముఖ్యంగా మద్రాసు రకం వంకాయలు అక్కడ మంచి ధర పలుకుతున్నాయి. దీంతో ఇక్కడ సాగు చేసే వంకాయలను తిరుపతి, కడప, చెన్నై, బెంగళూరు మార్కెట్లకు తరలిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో బయటి రాష్ట్రాల వ్యాపారులే నేరుగా తోటల వద్దకు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం కోత కూలీలు, రవాణా, పెట్టుబడి ఖర్చులు పోనూ రైతులు లాభాలు చవి చూస్తున్నారు.

లాభసాటిగా ఉంది



ప్రస్తుతం మిగతా పంటలతో పోల్చుకుంటే వంగతోటల సాగు లాభసాటిగా ఉంది. వంగతోటల సాగు మమ్మల్ని ఆదుకుంటోంది. టమాటతో పోల్చుకుంటే పదిహేను రోజులుగా మార్కెట్‌లో వంగ ధరలు నిలకడగా ఉన్నాయి. ఇవే ధరలు మరి కొన్ని రోజులు ఉంటే కష్టాలన్నీ తీరిపోతాయి. మంచి లాభాలు చూడటంతోపాటు ఎకరానికి అన్ని ఖర్చులు పోనూ రూ.4 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశముంది.

- పద్మావతి, మొరంమీదపల్లె

రెండు ఎకరాల్లో సాగు చేశా



రెండు ఎకరాల పొలంలో వంగ తోట సాగు చేశాను. ఉజాల రకం వంగ సాగు చేశాను. ప్రస్తుతం మార్కెట్‌లో వీటి ధరలు బాగానే ఉన్నాయి. టమాటతో నష్టపోయిన రైతులకు వంగ సాగుతో కొంత ఊరట కలుగుతోంది. మార్కెట్‌లో ఇప్పుడు కొన్ని రోజులుగా ధరలు నిలకడగా ఉన్నాయి. ధరలు ఇలాగే ఉంటే రైతుల కష్టాలు తీరుతాయి.

- రెడ్డిమోహన్, రైతు, చెరువుమొరవపల్లె